# 'తస్మాత్ జాగ్రత్త'

ఇది జరిగి చాలా ఏళ్లైంది... దాదాపు పాతికేళ్లు. అయినా మాకందరికీ ఈ విషయం ఎప్పటికీ గుర్తుంటుంది. రమణ అనబడే మా గుండుగాడి పెళ్లి... అప్పటికే పెళ్లైన ఉమానాథ్, విఠల్... ఇంకా బ్రహ్మచారులుగా ఉన్న నేనూ, మా దుబ్బోడు నలుగురం మా గుండుగాడి పెళ్లికెళ్లాలి.

మా గుండుగాడు కర్నూల్లో పుట్టి పెరిగి, చదివి, ఇక్కడే వ్యాపారం చేస్తున్నా వాడి మూలాలు మాత్రం దక్షిణ కన్నడ రాజ్యంలోని ఉడిపి క్షేత్రంలోనే. వాళ్లింట్లో ఈ రోజుకీ మాట్లాడేది తుళు భాషే. వాడి పెళ్లి కూడా ఉడిపికి దగ్గర చిన్న ఊళ్లో...

సో... అందువలన... కాబట్టి... అదుక్కె... ఇస్లియే మా ఉడిపి ప్రయాణం.

ఇప్పటికి కర్నూలు నించి ఉడిపికి నేరుగా బస్సుగానీ రైలుగానీ నడిచే సౌకర్యం నహి నహి... వయా బెంగుళూరు లేదా వయా బళ్లారి వెళ్లాల్సిందే. మాకు బళ్లారి మీదుగా వెళ్లడం సౌకర్యం.

బళ్లారి వెళ్లి అక్కడ్నించీ 'గజానన సర్వీస్' ప్రైవేటు బస్సులో ఉడిపికి డైరెక్టు ప్రయాణం. మనం చిన్నప్పుడు గోడ కుర్చీ వేయడం గుర్తుందా? (ఈ ప్రశ్న 45 సంవత్సరాలు దాటిన వాళ్లకేనని మనవి) అట్లా ఉంటుంది గజానన సర్వీస్‌లో ప్రయాణం మనం బళ్లారిలో బయల్దేరి ఉడిపిలో దిగేసరికి 'న' ఆకారంలో దిగుతాం. మనం మళ్లీ తిన్నగా నిటారుగా కావడానికో గంట పడుతుంది.

పెళ్లి జూన్ నెలలో... ఎండలు, సముద్ర తీరం, ఉక్క, చెమట తీరవు... చికాకు చికాకుగా ఉండింది.

ఉడిపి అన్న ఊరిపేరు దేశంలో దాదాపు అన్ని ప్రాంతాల వారికీ పరిచయమే. ఏ ఊరెళ్లినా అక్కడ 'ఉడిపి బ్రాహ్మణ హోటలు' ఖచ్చితం. హోటల్ పరిశ్రమకే కాక పుణ్యక్షేత్రంగా కూడా ఉడిపి ప్రసిద్ధి. అన్ని పుణ్యక్షేత్రాల్లాగే అదీ ఎంత అపరిశుభ్రంగా ఉండాలో అంత అపరిశుభ్రంగా ఉంది. ఈమధ్య కాస్త బెటరు. అక్కడ మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో మాకు బస. మాకు వాడి పెళ్లి ఓ బహానా... వాడి పెళ్లేకాదు యే పెళ్లైనా ఏ పంక్షనైనా మాకు పేకాటకీ, మందుకీ ఓ ఆటవిడుపు. ఇప్పుడు ఏభై ఏళ్లొచ్చాయి కాబట్టి కూతుళ్లకో కొడుకులకో సంబంధాలు వెదుకులాటకి కూడా వెసలుబాటుంటుంది.

సరే ముందురోజు మందు సరదాలో మునిగిన మాకు ఉదయాన్నే ముహూర్తం సమయానికి పెళ్లింటికి చేరడానికి యాతన.

పెళ్లైపోయింది. సుష్ఠుగా ఉడిపి బ్రాహ్మణ భోజనం చేశాం. ఇక మాదారి మాదే.

ఉడిపికి దగ్గరగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బేలూరు, హళేబీడు, శ్రావణబెళగొళ వెళ్లాలి. మాకు గైడ్ విఠల్‌గాడు. వాడికి ఆ ప్రాంతం కొట్టిన పిండి అని భ్రమపడి వాడి సారధ్యాన్నంగీకరించాం. వాడు మమ్మల్ని పెట్టిన తిప్పలు అన్నీయిన్నీ కావు. బస్టాండ్‌లో ఓ అరుగు మీద పడుకొని ఉమానాథ్ "వరేయ్, నేనో ప్రముఖ డాక్టర్ని. మా వూళ్లో అన్జెబితే ఎవడేనా నమ్ముతాడ్రా" అని అఘోరించడం ఈ రోజుకీ నవ్వు తెప్పిస్తుంది.

సరే ముందుగా వేణూరు, కార్కళ మీదుగా ధర్మస్థలకి తీసుకెళ్లాడు. అక్కడ్నించీ బేలూరు. బేలూరు హాల్ట్. 'అమరశిల్పి జక్కన' సిన్మా చూసింతర్వాత ఓ రొమాంటిక్ భావన బేలూరు మీద స్థిరపడిపోయి ఉండింది. ప్రత్యక్షంగా చూసిం తర్వాత అదింకా పెరిగిపోయింది. ('ఈ నల్లని రాలలో', 'నిలువుమా నిలువుమా నీలవేణి' పాటలు ఎంత కమ్మటివీ!) బేలూరునించీ హళేబీడు చాలా దగ్గర... త్వరగా చూసేసి సాయంకాలానికి మళ్లీ బేలూరు రావాలని విఠల్ తొందరపెట్టి తరిమాడు. హళేబీడు చేరాం.

జూన్ నెల. భయంకరంగా ఉక్క. సూర్యుడు చెలరేగిపోయాడు. నోరార్చుకు పోతోంది. గుడి కాంప్లెక్స్ వెలుపల కొబ్బరిబొండాంల గుట్ట రారమ్మని ఆహ్వానించింది. చెమటలు కక్కుతూ వెళ్లాం.

ఓ పద్దెనిమిదిరవై ఏళ్ల అమ్మాయి బోండాలు కొడుతోంది. చామనఛాయతో, మంచి కళతో ఇంకా అద్భుతమైన శరీర సౌష్ఠవంతో, అక్కడి శిల్పాల్లో ఓ శిల్పంలా ఉంది. ఇంకేం దేశంకాని దేశం మన తెలుగు ఇక్కడెవడికి తెలిసేడుస్తుందని ధీమాతో, ఆ అమ్మాయి అంగాంగ వర్ణనలు చేస్తూ తలో రెండు బోండాంలు తాగాం... మొదటిది దాహం కోసం, రెండోది ఆ అమ్మాయినింకాసేపు చూడటం కోసం, నేనూ ఉమానాథ్ కాస్త పచ్చిగానే మాట్లాడుకున్నాం ఆ అమ్మాయి గురించి.

'తాళ ఫలా దపి గురు మతి సరసం
కిము విఫలీ కురుషే కుచ కలశం'

అని జయదేవుడిలా సంస్కృతంలో అనక అచ్చ తెనుగులో పేలాం.

ఇంతలో మా గైడ్‌గాడు విఠల్ 'బస్సొచ్చేసిందొచ్చేసింద'ని తొందరపెట్టాడు. ఉమానాథ్ అప్పటికే ఆ అమ్మాయికి ఓ ఏభై నోటిచ్చి ఉన్నాడు. బస్సు తొందరలో బోండాంలు పారేసి వచ్చేస్తున్నాం. ఆ కొబ్బరి బోండాంలమ్మాయి వెనకనించీ "అన్నా! అన్నా! చిల్లర

తీసుకోండి మర్చిపోయినారు" అని స్వచ్ఛమైన తెలుగులో వేసిన కేకతో ఒక్కసారి గుండెలు జారిపోయాయి.

ఆ అమ్మాయి మా మాటలు విన్నట్టు లేదు. వినుంటే!

నిజమేకదా తెలుగు వాళ్లెక్కడైనా ఉండొచ్చు. హోషియార్!

* * *

***ప్రతి మనిషిలో ఓ కోతి బంధించబడి ఉంటుంది. అది ఒక్కోసారి తప్పించుకుని బైటికొచ్చి పిచ్చి గెంతులేస్తుంది... దాన్ని పట్టి మళ్లీ లోపలికి నెట్టాలి.*** ●